# బీఆర్‌ఎస్ తీరుతోనే రైతుల ఆత్మహత్యలు

● బీజేపీ ఆలేరు పాలక్,
మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



పరకాల : ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



శాయంపేట : తహసీల్దార్‌కు..

**పరకాల** : బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరుతోనే రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీజేపీ ఆలేరు పాలక్, స్థానిక మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆందోళన వెలిబుచ్చారు. గతేడాది కురిసిన వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరుతూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ రామునాయక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బాధిత రైతులను విపత్కర పరిస్థితుల్లో ఆదుకునేలా ఫసల్ భీమా యోజన పథకాన్ని తీసుకురాగా తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు వర్తింపజేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అతడి అనుచరులకు మాత్రమే పరిహారం ఇప్పించుకుంటున్నారని, అర్హులైన పేద రైతులను విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే అర్హులైన రైతులందరికీ లబ్ధి చేకూర్చేలా ఫసల్ భీమా యోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. బాధిత రైతులను ఆదుకోని పక్షంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్ లాల్, కొత్తగూడెం నియోజకవర్గ ప్రభారీ దేవునూరి మేఘనాథ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పూల్లురు రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగవేణ రవీందర్ యాదవ్, మండల అధ్యక్షుడు మాడుగుల సాంబరెడ్డి, పరకాల పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు సంగా పురుషోత్తం, నాయకులు కొమ్మిడి మహేందర్‌రెడ్డి, అంబీర్ కిషన్‌రావు పాల్గొన్నారు.

**శాయంపేట** : అకాల వర్షాలకు మండలంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఉప్పు రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చిట్టిరెడ్డి మల్లారెడ్డి, కార్యదర్శి బత్తుల రవి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎర్ర రాకేష్‌రెడ్డి, నాయకులు కొడెపాక స్వరూప, సంజీవరావు, మేకల సుమన్ పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



పరకాల : కేక్ కట్ చేస్తున్న నాయకులు



దామెరలో..



నడికూడలో..

**పరకాల** : బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మడికొండ శ్రీను, సమన్వయ కమిటీ సభ్యుడు పావుశెట్టి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

**దామెర** : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, నాయకులు బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, దామెరుప్పుల శంకర్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

**నడికూడ** : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మచ్చ అనసూర్య, వైస్ ఎంపీపీ కుమారస్వామి, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, నాయకులు గణపతిరెడ్డి, జైపాల్ రెడ్డి, రవీందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

## పరిహారం కోసం పోరాటం తప్పదు



**నడికూడ** : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించడం కోసం పోరాటం తప్పదని బీజేపీ ఆలేరు పాలక్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. మండలంలోని నర్సక్కపల్లి, పులిగిల్ల, చర్లపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన ఆధ్వర్యంలోని బృందం గురువారం సందర్శించింది. అనంతరం భిక్షపతి మాట్లాడారు. అకాల వర్షాలకు మొక్కజొన్న, వరి, ఇతర పంటలు సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారని చెప్పారు. గతేడాది పరిహారం ఇప్పించడంలోనూ ఎమ్మెల్యే ధర్మారెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. వడగండ్ల వానతో దెబ్బతిన్న మొక్కజొన్న, వరి పంటలను వెంటనే సర్వే చేయించంతోపాటు బాధిత రైతులకు తక్షణ సాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత రైతులకు అండగా పార్టీ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్ లాల్, మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ సింగవేన రవీందర్, నాయకులు మేఘనాథ్, ఇంద్రసేనారెడ్డి, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న రైతు మృతి

**కమలాపూర్** : మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన రైతు చీరె సురేష్ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. ఎస్సై చరణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఈనెల 24న సురేష్ తన భార్యతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం ఎడ్లబండిపై పొలం వద్దకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు బండిపై నుంచి కింద పడి గాయాలపాలయ్యాడు. స్థానికుల సాయంతో సురేష్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ రెండు రోజులు చికిత్స పొందిన అనంతరం సురేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చరణ్‌కుమార్ తెలిపారు.

## మే 1 నుంచి సమ్మర్ క్యాంప్

● 'ఎస్ఆర్‌కే' ప్రిన్సిపాల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి

**ఎల్కతుర్తి** : భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు గ్రామంలోని ఎస్ఆర్‌కే స్కూల్‌లో మే 1 నుంచి నెల రోజులపాటు విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో క్యాంప్‌లో విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్, చెస్, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డాన్స్, అబాకస్, సోషల్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిష్ణాతులైన ట్రైనర్స్‌తో శిక్షణ ఇప్పించనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే దిశగా క్యాంప్ దోహదపడుతుందని తెలిపారు. క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 9391474797, 8919802898ల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## 'చలివాగు' మరమ్మతుకు రూ.10.21 కోట్లు



**శాయంపేట** : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవతో మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.10.21 కోట్లు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిందని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ ప్రాజెక్టు మరమ్మతు పనులకు ప్రభుత్వం గతంలో రూ.3.94 కోట్లు విడుదల చేయగా సరిపోని పరిస్థితిలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితోపాటు వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ప్రత్యేక చొరవ తీసుకుని చెరువు కట్ట, పూడికతీత, తూము, కాలువల మరమ్మతులతోపాటు సమగ్ర మరమ్మతుల కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. త్వరలో టెండర్ ప్రక్రియను పూర్తి చేయించి పనులు చేయించనున్నట్లు తెలిపారు. గండ్ర దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లత లక్ష్మారెడ్డి, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, నాయకులు రాజేందర్, మోహన్, పాపయ్య, కరణ్‌బాబు, కిష్టయ్య, గణేష్, శంకరాచారి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కుటీర పరిశ్రమలతో మహిళలకు లబ్ధి



శిక్షణ పొందుతున్న మహిళలతో హరిప్రసాద్

**కమలాపూర్** : కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే మహిళలకు లబ్ధి చేకూరుతుందని జిల్లా పారిశ్రామిక సంస్థ జనరల్ మేనేజర్ హరిప్రసాద్ తెలిపారు. మంలంలోని ఉప్పల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. మహిళలు ఆహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు మార్కెటింగ్‌లో మెళకువలు నేర్చుకోవాలని చెప్పారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఎదగాలన్నారు. మార్కెట్లో టమాట సాస్, చిల్లీ సాస్, చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీ, మాంసం పచ్చళ్లకు మంచి గిరాకీ ఉందన్నారు. మహిళలు తయారు చేసిన పచ్చళ్ల నాబార్డ్ సహకారంతో మార్కెటింగ్ చేయడానికి సహకరిస్తానని తెలిపారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోదల్చిన మహిళలకు పీఎంఎఫ్ఎంఈ ద్వారా రుణ సదుపాయం ఉందన్నారు. పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ కుమార్, సర్వోదయ సంస్థ సిబ్బంది అక్తర్, రవీందర్, తిరుమల, హైమ పాల్గొన్నారు.

## రేపు దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

**శాయంపేట** : దివ్యాంగులకు 50 శాతం రాయితీతో రేపు (శనివారం)మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బస్‌పాస్‌లు పంపిణీ చేయనున్నట్టు ఆర్టీసీ ఉద్యోగులు బంగారు సదానందం, ఓదేలు తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో గురువారం వారు మాట్లాడారు. పరకాల డిపో ఆధ్వర్యంలో దివ్యాంగుల శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం దివ్యాంగులకు, విద్యార్థులకు రాయితీపై బస్‌పాస్‌లు అందిస్తోందని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఆధార్, సదరం సర్టిఫికెట్‌ల జిరాక్స్ తోపాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వెంట తీసుకుని రావాలని చెప్పారు. బస్‌పాస్ కోసం రూ.50లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

# నిబంధనల మేరకే గొర్రెల పంపిణీ



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటనారాయణ

**దామెర** : ప్రభుత్వ నిబంధనల మేరకే అర్హులకు రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తామని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ తెలిపారు. మండలంలోని ఊరుగొండ గ్రామంలోని రైతు వేదికలో లబ్ధిదారులతో గురువారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. మొదటి విడత గొర్రెల పంపిణీ సత్ఫలితాలిచ్చిందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న గొర్రెలను లబ్ధిదారులు వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని ఆకాంక్షించారు. లబ్ధిదారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎంపీపీ కాగితాల శంకర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దీపిక, వీఎల్ఓ లక్ష్మణ్, జేవీఓ రవి, ఎల్ఎస్ఏ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నిబంధనలు పాటించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

**ఐనవోలు** : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించే సమయంలో రైతులు నిబంధనలు పాటించాలని నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు కోరారు. మండలంలోని కక్కిరాలపల్లి, గర్మిళ్లపల్లి, ఉడుగూడెం గ్రామాల్లో ఆ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాలు లేకుండా, 17 శాతానికి మించని తేమతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. వరుస క్రమంలో కాంటాలు పెడతారని చెప్పారు. ఏఈఓలకు రైతులు సహకరించాలని కోరారు. క్వింటా 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, 'బీ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,040 చెల్లిస్తారని, ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు వడిచర్ల శ్రీనివాస్, బొమ్మినేని బుచ్చిరెడ్డి, చింతబాబు, సర్పంచ్‌లు కంజర్ల రమేష్, గండి మల్లికాంబ, బరిగల ఆరోగ్యం, ఎంపీటీసీ తాటికాయల రమేష్, ఉపసర్పంచ్‌లు బొల్లం ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి, రైతుబంధు సమితి నాయకులు పడిదల సమ్మారావు, వార్డు సభ్యులు కాత లక్ష్మీ, యాదగిరి, రఫీ,, నాయకులు ఆకుతోట యాకయ్య, అబ్బాస్ అలీ, యాదవరెడ్డి, రాజేంద్రప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రేమ్‌దాస్, దామెర అనిల్, సదానందం పాల్గొన్నారు.

## జోగంపల్లి ప్రాజెక్ట్‌ను సందర్శించిన విద్యార్థులు



**పరకాల** : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా జోగంపల్లి ప్రాజెక్ట్‌ను గురువారం సందర్శించారు. ప్రాజెక్ట్‌లోని జీవవైవిధ్యంపై అధ్యయనం చేశారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.రాజయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.సుభాషిణి విద్యార్థులకు జోగంపల్లి ప్రాజెక్టు వల్ల ఉన్న ప్రయోజనాలను వివరించారు. అనేక జీవజాతుల మనుగడకు ప్రాజెక్ట్ దోహదపడుతోందని చెప్పారు. పర్యావరణ సమతుల్యతను అర్థం చేసుకోవటానికి ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.స్వప్న, దుప్పటి సంజయ్, టి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా సర్వే చేయాలి



**శాయంపేట** : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సమర్థవంతంగా సర్వే చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఏడీఏ విద్యాసాగర్ ఆదేశించారు. మండలంలోని పెద్ద కోడెపాక గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, ఇతర పంటలను గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ విద్యాసాగర్ అధికారులకు సూచనలు చేశారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, వరి తదితర పంటలను పకడ్బందీగా సర్వే చేయాలని చెప్పారు. అర్హులందరికీ పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, ఏఈఓ శివ, వార్డు సభ్యులు కోగిల కిరణ్, కోగిల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు సర్వీస్ పునరుద్ధరణ



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

**నడికూడ** : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతో మండల కేంద్రం నుంచి వరంగల్‌కు ఆర్టీసీ బస్సుసర్వీస్‌ను పునరుద్ధరించినట్టు ఎంపీపీ మచ్చ అనసూర్య, సర్పంచ్ ఊర రవీందర్‌రావు తెలిపారు. మండల కేంద్రం నుంచి కంఠాత్మకూర్ మీదుగా వరంగల్‌కు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను వారు గురువారం ప్రారంభించి మాట్లాడారు. బస్సు ప్రతిరోజూ 4 ట్రిప్పులు నడుస్తుందని చెప్పారు. గతంలో ఆర్టీసీ బస్సు సదుపాయం ఉండగా పలు కారణాల వల్ల రద్దైందని చెప్పారు. రైతులు, విద్యార్థులు, ప్రజలకు సదుపాయం కల్పించేలా ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించేలా చొరవ తీసుకోవాలని పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రజలు ఆర్టీసీ బస్సు సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు, నాయకులు నెమరుగొమ్ముల రవీందర్‌రావు, నారగాని శ్రీను, గొడిశాల రంజిత్, కిన్నెర మణి, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పంట నష్టపరిహారం



**దామెర** : అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం పంట నష్టపరిహారం అందిస్తుందని ఎంపీపీ కాగితాల శంకర్ తెలిపారు. మండలంలోని ఓగ్లాపూర్ గ్రామంలో గతేడాది పంట నష్టపోయిన రైతులకు గురువారం ఆయన పరిహారం చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఇటీవల పంటలు దెబ్బతిన్న రైతులను గుర్తించి త్వరలోనే పరిహారం అందజేయనున్నట్టు తెలిపారు. మరిన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీనివాస్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, నాయకులు జన్ను మల్లయ్య, కిన్నెర రమేష్, రాధాకృష్ణ, రాజిరెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

# పంట నష్టాన్ని పక్కాగా తేల్చాలి



మాట్లాడుతున్న దూదిపాల బుచ్చిరెడ్డి

**శాయంపేట** : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని పకడ్బందీగా సర్వే చేసి తేల్చి బాధిత రైతులందరికీ పరిహారం అందించి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని, వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మండలంలో భారీగా వరి, మొక్కజొన్నతోపాటు వాణిజ్య పంటలు సైతం దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేయడంలో ఖచ్చితత్వాన్ని పాటించాలని కోరారు. నష్టం జరిగిన ప్రతిసారీ వ్యవసాయ విస్తరణ అధికారులు కేవలం మొక్కజొన్న పంటను మాత్రమే పరిశీలిస్తూ, నామమాత్రంగా సర్వే చేస్తూ వరి నష్టాన్ని సర్వే చేయడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. అన్ని రకాల పంటలపై క్షేత్రస్థాయిలో సర్వే చేయించి ఎకరాకు రూ.20 వేల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు సమర్థవంతంగా సర్వే చేసి అర్హులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిందం రవి, చింతల రవిపాల్, మాదిరెడ్డి ప్రపంచరెడ్డి, మహ్మద్ రఫీ, మారేపల్లి రాజు, కట్టయ్య పాల్గొన్నారు.

## ధాన్యం కోత డబ్బులు ఇప్పించండి



**శాయంపేట** : గత రబీలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో తాము ధాన్యం విక్రయించిన సందర్భంలో పెట్టిన కోతకు సంబంధించి డబ్బులు ఇప్పించాలని కాట్రపల్లి గ్రామ రైతులు జీడిమడ్ల రమేష్, రవి, వనమ్మ కోరారు. మండలంలోని ఆ గ్రామంలో గురువారం వారు విలేకరుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. తాము ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తుండగా తూకంలో కోతలు విధిస్తుండడం పరిపాటిగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు. గతేడాది రబీలో తాము ధాన్యం విక్రయించగా ఒక్కో రైతు నుంచి 2, 3 బస్తాల ధాన్యాన్ని కోత పెట్టడంతో తాము భారీగా నష్టపోయామని వాపోయారు. పీఏసీఎస్ డైరెక్టర్ సదర్‌లాల్ ఎదుట నిర్వాహకులను నిలదీయగా డబ్బులు చెల్లిస్తామన్నారని చెప్పారు. కాగా ఇప్పటివరకు కోతకు సంబంధించిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా నిర్వాహకులు స్పందించి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ధాన్యం కోతపై సమగ్ర విచారణ జరిపి నష్టం కలిగిస్తున్న నిర్వాహకులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుని బాధిత రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు.

# అంబేడ్కర్, పూలే మార్గంలో పోరాడతాం

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్



మాట్లాడుతున్న రాజేందర్

**ఆత్మకూరు** : డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే మార్గంలో సమాజంలోని బడుగుల సమస్యలపై పోరాడతామని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యావత్ భారతదేశం ఉలిక్కిపడేలా చోటు చేసుకున్న కారంచేడు, చుండూరు ఘటనల అనంతరం దళిత బహుజనుల పక్షాన నిలిచేందుకు ఫ్రంట్ ఆవిర్భవించిందని చెప్పారు. నాటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో పీడిత వర్గాల విముక్తి కోసం పోరాడుతున్నట్టు తెలిపారు. మే 15న తలపెట్టిన ఉమ్మడి వరంగల్ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదాసి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా సిలువేరు శ్రీనివాస్‌లతో కమిటీని ప్రకటించారు. సమావేశంలో ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, నాయకులు స్వామి, మందపల్లి నర్సయ్య, సిలువేరు రాజు, ఒంటేరు రాజీరు, మాసు రాజు, కిరణ్, ప్రభాకర్, కృష్ణ పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**ఎల్కతుర్తి** : నేడు (శుక్రవారం) మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తూర్పాటి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.



## జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ, హనుమకొండ జిల్లా

### టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం. E/48/TMREIS/Dietary items / 2023-24 Date: 27-04-2023

హనుమకొండ జిల్లాలోని తెలంగాణా పాఠశాల & కళాశాలలు (01) హన్మకొండ (బాలికలు-1), (02) హన్మకొండ (బాలురు-1), (03) ఖాజీపేట్ (బాలురు-1) మరియు (04) పర్కాల్ (బాలురు-1) లలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మరియు హాస్టల్ నిర్వహణ నిమిత్తం 2023-24 విద్యా సంవత్సరానికి గాను అవసరమైన ఆహార పదార్థములు (1) కిరాణ సరుకులు, (2) కూరగాయలు, (3) స్కిన్ లెస్ చికెన్, (4) పండ్లు మరియు (5) గ్రుడ్లు మరియు మొదలగునవి సరఫరా చేయుటకు గాను ఆసక్తిగల వ్యక్తులు (FIRMS) సంస్థల నుండి పాఠశాల & కళాశాల అంశముల వారిగా సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

| క్రమ సం. | టెండర్ పేరు (సరఫరా వివరములు) | ఫారము ధర రూపాయలలో (పాఠశాలలకు & కళాశాలలకు కలిపి) | దరావత్ సొమ్ము రూపాయలలో (పాఠశాలలకు & కళాశాలలకు కలిపి) |
|---|---|---|---|
| 1 | కిరాణా సరుకులు | 2,000 | 1,00,000 |
| 2 | కూరగాయలు | 2,000 | 30,000 |
| 3 | స్కిన్ లెస్ చికెన్ | 2,000 | 30,000 |
| 4 | పండ్లు | 2,000 | 30,000 |
| 5 | గ్రుడ్లు | 2,000 | 30,000 |

టెండరు నియమ నిబంధనలు మరియు EMD వివరములు టెండర్ ఫారములో పొందుపరచబడినవి.

పైన పేర్కొన్న ప్రతి టెండర్ అంశానికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన టెండర్ దరఖాస్తులను పొందుటకు రుసుము రూ: 2000/- (అక్షరాల రెండు వేల రూపాయలు మాత్రమే) ల డిమాండ్ డ్రాఫ్ట్ ను District Minorities Welfare Officer, Hanamkonda పేరున తీసి అట్టి డిమాండ్ డ్రాఫ్ట్‌ను జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయము, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ కార్యాలయము, కలెక్టరేట్, సుబేదారి, హన్మకొండ, హనుమకొండ జిల్లా నందు అందచేయగలరు. దరఖాస్తు రుసుము మరియు EMD చెల్లించుటలో ఎవరికి మినహాయింపు లేదు. అట్లు చెల్లించని టెండరు ఫారములు తిరస్కరించబడును.

**టెండర్ నోటిఫికేషన్ - షెడ్యూల్**

| క్రసం. | విషయము | తేది |
|---|---|---|
| 1 | టెండర్ నోటిఫికేషన్ తేది | 28-04-2023 |
| 2 | టెండర్ దరఖాస్తు పొందుటకు చివరి తేది | 29-04-2023 నుండి 09-05-2023 సా॥ 3.00 గంటల వరకు |
| 3 | టెండర్ దాఖలు చేయుటకు చివరి తేది | 09-05-2023 సా॥ 3.00 గం॥ వరకు |
| 4 | టెండర్ ధరఖాస్తులను తెరువబడు తేది | 10-05-2023 సా॥ 3.30 గం॥లకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ), ఛాంబర్ కలెక్టర్ కార్యాలయము హనుమకొండ జిల్లా |

**గమనిక** : పైన పేర్కొన్న తేదీలు, టెండర్ విధి విధానములు, షరతులు అన్ని విషయాలలో మార్పులు చేయు అధికారము మరియు పూర్తిగా రద్దు పరిచి తదుపరి నిర్ణయం తీసుకొనే అధికారం జిల్లా కలెక్టర్ / చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, హనుమకొండ వారికి కలదు. ఈ విషయాలలో ఎటువంటి వాదోపవాదాలకు తావులేదు.

సం/- జిల్లా అదనపు కలెక్టర్ / చైర్మన్ (రెవెన్యూ)
జిల్లా కొనుగోలు కమిటీ మైనారిటీ సంక్షేమ శాఖ, హన్మకొండ జిల్లా.